ప్రజాశక్తి
ఆదివారం 11 డిసెంబర్ 2022 5
శ్రీ సత్యసాయి

బొమ్మనహాల్‌లో వర్షానికి తడవకుండా మొక్కజొన్నపై కప్పిన తార్పాలిన్లు

ముసురుకున్న మాండూస్..!

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడివాన ◆ అప్రమత్తత ప్రకటించిన అధికారులు

బుక్కరాయసముద్రం మండలంలో వరి తడవకుండా ప్లాస్టిక్ పేపర్లు కప్పుతున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాండూస్ తుఫాను ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాపై పడింది. శుక్రవారం రాత్రి నుంచే జిల్లాలో మబ్బులు కమ్ముకున్నాయి. ఇక శనివారం ఉదయం నుంచి ఏకధాటిగా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఎక్కడా భారీ వర్షాలు పడనప్పటికీ ఏకధాటిగా పడుతున్న వర్షాలతో చిత్తడి నెలకొంది. తుపాను తీరం దాటిన నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికి జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. పుట్టపర్తిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు అక్కడి జిల్లా కలెక్టర్ బసంత్ కమార్ తెలిపారు.

తేలికపాటి వర్షాలే...

శుక్రవారం రాత్రి నుంచే వర్షాలు మొదలైనప్పటికీ ఎక్కడా భారీ వర్షాలు పడలేదు. సత్యసాయి జిల్లాలో ఎన్‌పికుంటలో అత్యధికంగా 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, అమడగూరులో 14.8 మిల్లీమీటర్లు నమోదయింది. సత్యసాయి జిల్లా అంతటా చూసినప్పుడు సగటున 4.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. అనంతపురం జిల్లా పరిధిలో యల్లనూరులో 8 మిల్లీమీటర్లు, నార్పలలో 6.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. ఈదురుగాలులతోపాటు చిరుజల్లులు పడుతుండటంతో జనం బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఒకవైపు చలి మరోవైపు చిరుజల్లులు జనాలను వణికించాయి.

పంటలపై తీవ్ర ప్రభావం

ఎడతెరిపిలేకుండా పడుతున్న చిరు జల్లుల ప్రభావం పంటలపై తీవ్రంగా ఉండే అవకాశముంది. గత నెలలో పడిన అధిక వర్షాలక ఇప్పటికే పెద్దఎత్తున పంటలకు తెగళ్లు వ్యాపించాయి. పత్తి పంట దిగుబడి పూర్తిగా దెబ్బతింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో పత్తి పంట ఉంది. మొదటి కోత అయిపోయి రెండో కోత దశలో ఉన్న సమయంలో పడుతున్న సమయంలో ఈ వర్షాలకు తెగుళ్లు మరింత వ్యాపించే అవకాశముందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇక 70 వేల ఎకరాల్లో వేసిన మిరప పంటది ఇదే పరిస్థితి. నల్లతామర తెగుళ్లు ఇప్పటికే పంట దిగుబడులపై ప్రభావం చూపింది. ఇప్పుడు మరిన్ని తెగుళ్లు వ్యాపిస్తే పంట చేతికొచ్చింది పోయే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన పంటల్లో ప్రధాన పంట అయిన అరటికి సిగటోమా తెగుళ్ల ఈ వాతావరణంలో అధికమై చేతికొచ్చిన పంట రైతుకు దక్కకుండాపోయే అవకాశాలున్నాయి. ఇప్పటికే తోటల్లో సిగటోమా లక్షణాలు అధికంగా ఉన్నాయి. ఈ వర్షాలకు మరింత నష్టం జరుగనుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : సత్యసాయి జిల్లా కలెక్టర్

మాండూస్ తుఫాను తీరం దాటిన సమయంలో వర్షాలు అధికంగా పడే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. జిల్లాలో రెండు రోజుల పాటు అధిక వర్షాలొస్తాయని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా పుట్టపర్తి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏదైనా ఇబ్బంది ఉంటే 08555292432, 9154968578 నంబరుకు ఫోన్ చేసి సమాచారమివ్వాలని తెలిపారు.

తడిసి ముద్దవుతున్న ధాన్యం

బొమ్మనహాల్ : తుంగభద్ర ఆయకట్టు కింద పంటలు కోసి కుప్పవేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సగం మంది రైతులు వరి, మొక్కజొన్న పంటలు కోత కోశారు. వాటిని కుప్పగా పోశారు. వర్షాలకు అవి తడిసి ముద్దవుతున్నాయి. కోతకోయని పంటలు వర్షాలకు పొలాల్లో నేలవాలాయి. పంట చేతికొచ్చే సమయంలో నోటికి అందకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

బుక్కరాయసముద్రం : తుఫానుతో కురుస్తున్న వార్షాలకు మండలంలో దాదాపు 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. పంటచేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాల వల్ల వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయని రైతులు వాపోతున్నారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం ..

చెన్నేకొత్తపల్లి మండలం ద్యామాజీపల్లిలో వర్షంతో మునిగిని కాకరపంట

చెన్నేకొత్తపల్లి : అకాల వర్షాలతో చెన్నేకొత్తపల్లి మండలం ద్యామాజుపల్లి గ్రామంలో యువ రైతు అనంతరెడ్డి కాకర పంట మొత్తం నీటమునిగింది. అనంతరెడ్డి రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని అందులో కాకర పంటను సాగు చేశాడు. తుపాన్ ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం నీటి మునిగింది. పంట సాగునిమిత్తం రైతు రూ.2 లక్షలు అప్పుచేసి ఆధునిక పద్ధతిలో కాకర కట్టి కట్టి సాగు చేసేడు. కోత దశలో ఉండగా ప్రస్తుతం పడిన వర్షంతో పంట మొత్తం చేతికందకుండా పోయింది. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

వర్షాలతో మల్బరీకి నష్టం

లేపాక్షి : తుపానుతో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని మామిడిమాకులపల్లి గ్రామంలో మల్బరీకి తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు నంజిరెడ్డి, రాఘవేంద్రరెడ్డిలు సాగు చేసిన 80 చంద్రికలకు తడి తగిలి గూళ్లను అల్లలేదు. దీంతో దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంట నాశనం అయ్యిందన్నారు.

కార్మికహక్కులపై కేంద్రం దాడి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేసి నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎల్.ఆదినారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, సిఐటియు మండల కార్యదర్శి అయూబ్ ఖాన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రయివేటీకరించడం, ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అమ్మేయడమే లక్ష్యంగా ప్రధాని మోడీ పాలన సాగుతోందన్నారు. కార్మిక హక్కులను కాలరాసి నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేయాలని చూస్తున్నారని చెప్పారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి పెట్టుబడిదారులకు లాభం చేసే కుట్రలను బిజెపి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి కేంద్రం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించకుండా వత్తాసు పలికేలా వ్యవహరించడం దుర్మార్గం ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వెంటనే స్కీం వర్కర్లు, నిరుద్యోగులపై కక్ష కట్టి ఉద్యోగాల నుంచి తొలగించి చర్యలకు ఉపక్రమించిందన్నారు. ఇలాంటి వాటిని కార్మికులు ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలన్నారు. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు సంఘటితంగా పోరు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్టు రంగం రాష్ట్ర నాయకులు రఫీ, పట్టణ నాయకులు తొండమాల బాబు, జబివుల్లా, రామంజి, రవి, మున్సిపల్ కార్మికసంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, చెన్నకేశవులు, పుల్లన్న, మీటర్ రీడర్ నాయకులు దస్తగిరి, పాల్గొన్నారు.

13న వాహనాల వేలం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈ నెల 13వ తేదీన వేలం ఉన్నట్లు అదనపు జిల్లా సెబ్ అదనపు ఎస్పీ కెవి.రామకష్ణ ప్రసాద్ తెలిపారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు స్పెషల్ ఇన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాలు వేలం వేనున్నట్లు తెలిపారు. హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలో 74, రూరల్ పీస్‌లో 27, మడకశిర పీస్‌లో 28, మడకశిర సెబ్ స్టేషన్‌లో 8, ధర్మవరం సెబ్ స్టేషన్‌లో 6 కలిపి మొత్తం 143 వాహనాలను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఆయా నిర్దేశించిన ప్రాంతాలో వేలంలో పాల్గొనవచ్చున్నారు. వేలంపాటలో పాల్గొనదలచినవారు ఆధార్ కార్డ్ జిరాక్స్‌తో పాటు ప్రభుత్వం నిర్ధేశించిన మొత్తం చెల్లించాలని సూచించారు.

24, 25న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

ఈ నెల 24, 25వ తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. సత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో సత్యసాయి జిల్లా క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. పోటీల్లో విజేతలకు ట్రోఫీని అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనాలుకునే జట్లు ఈనెల 23వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు శివ 9550448265, వినయ్ 630 3078137, శ్యామ్ 9908889464 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కదిరిలో జిల్లాస్థాయి మార్షల్ ఆర్ట్స్ క్రీడాపోటీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో శనివారం ఉదయం జిల్లా స్థాయి మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. బాలికల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు దానమయ్య, మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని పాఠశాల స్థాయి విద్యార్థులు పాల్గొన్నారు. ఖావంకీ, లోబో విభాగాల్లో పాల్గొని వారి ప్రతిభను కనపరిచారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గాండ్లపెంట కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న మద్దిమడుగు తేజశ్రీ రాష్ట్ర సాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యింది. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు నెల్లూరు సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 17, 18న జరిగే పోటీల్లో పాల్గొంటారని మార్షల్ ఆర్ట్స్ మాస్టార్ షాకీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి రవి, జిల్లా ఏపీ పీడీ అసోషియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు బయరెడ్డి, నరసింహారెడ్డి, లష్కర్ నాయక్, రాజాశేఖర్, బాబా, లక్ష్మీనారాయణ, కేశవమూర్తి, గోపాల్ రెడ్డి, రాజశేఖర్, ప్రసాద్, ఆదినారాయణ, శివ, రాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ ఛైర్మన్ ఇస్మాయిల్, రెఫరీలు ఖాదర్, చాందిని, అనంతపురం జిల్లా కోచ్ మురళికష్ణ రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయురాలు మంజు భార్గవి పాల్గొన్నారు.

ముస్లిములను ఓటుబ్యాంకుగా చూసిన చంద్రబాబు

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని వైసిపి పురం ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ విమర్శించారు. శనివారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పొన్నూరులో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీ సదస్సులో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు టీడీపీ అధికారంలోకి రాగానే ముస్లిం మైనారిటీలకు మంత్రిమండలి లో ప్రాధాన్యత కల్పిస్తా, నామినేట్ పదవుల్లో అవకాశం కల్పిస్తా అని చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ముస్లిములకు ఏమి చేశారో చెప్పాలన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ మంత్రిగా పల్లె రఘునాథరెడ్డికి ఇచ్చినప్పుడు మైనార్టీలు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలను ముస్లిములు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని వైసిపి ప్రభుత్వం ముస్లిములకు అన్ని విధాలా న్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉర్దూను ద్వితీయ భాషగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ముస్లిం సబ్‌ప్లాన్ కోసం అసెంబ్లీలో చట్టం చేసిన మొదటి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. హజ్‌యాత్రకులకు రూ.30 నుంచి రూ.60 వేలు, ఇమామ్, మౌజన్లకు రూ. 5 నుండి 10 వేల చొప్పున గౌరవేతనం ఇస్తున్న జగన్ ప్రభుత్వనికే దక్కుతుందన్నారు. ముస్లింల పెన్షన్ల కోసం రెండు వేల కోట్ల రూపాయలను వైసిపి ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులన్నింటినీ ప్రభుత్వం పరిరక్షిస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ముస్లిం మైనార్టీ ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారని ఆయన స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి మరోమారు ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపడతారన్నారు.

టీడీపీ బీసీ విభాగం జోనల్ కోఆర్డినేటర్‌గా ఎల్ఐసి నర్సింహులు

ఎల్ఐసి నరసింహులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

టిడిపి రాష్ట్ర బీసీ విభాగం రాయలసీమ జోన్ కోఆర్డినేటర్‌గా ఎల్ఐసి నర్సింహులు నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు అధిష్టానం నుంచి నియామక పత్రాలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తనను రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా అధిష్టానం నియమించిందని చెప్పారు. ఇప్పుడు అదనంగా ఈ బాధ్యత అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని తన నియామకమే నిదర్శనమన్నారు. తనపై నమ్మకంతో పదవి కట్ట పెట్టినందుకు అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత కష్టపడి పార్టీ అభివద్ధికి కషి చేస్తామన్నారు. తనను పదవిలో నియమించిన జాతీయ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెంనాయుడు, బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోల్లు రవీంద్ర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్పకు కతజ్ఞతలు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలను తెలియజేస్తా : ఎంపిపి

ప్రజాశక్తి-అగళి

ఈ నెల 15వ తేదీన మడకశిర నియోజకవర్గంకు వస్తున్న రాయలసీమ ప్రాంతీయ కోఆర్డినేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అగళి మండల, వైసిపి పరిస్థితిపై వివరిస్తామని ఎంపిపి రేణుక కామరాజు తెలియజేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపిగా తనకు అధికారులు ఇవ్వకుండా మడకశిర శాసనసభ్యులు తిప్పేస్వామి అడ్డుకుంటున్నారన్నారు. వైసిపిలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఎంపిపిగా ఉన్నా తన మాట ఎంపిడిఒ కార్యాలయంలో ఎవరూ వినడం లేదన్నారు. ఈ సమస్యలు అన్నింటిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

నారాయణ పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

సెలవురోజుల్లో పాఠశాలలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

సెలవు రోజుల్లో సైతం తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న నారాయణ కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. రెండవ శనివారం అయినప్పటికీ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను నారాయణ విద్యాసంస్థల లెక్కజేయడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవు రోజుల్లో కూడా సెలవు ఇవ్వకుండా విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు నిహాల్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

12న వెంకటగారిపల్లిలో 'ఇదేమి ఖర్మ'

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని వెంకటగారిపల్లి గ్రామంలో ఈ నెల 12వ తేదీన టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇదేమిఖర్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వెంకటగారిపల్లి పంచాయతీ కేంద్రంలో నిర్వహించే ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రక్తదానం చేస్తున్న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్

యువకుల రక్తదానం

హిందూపురం : మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని యువకులు రక్తదానం చేశారు. బెంగళూరు రోడ్డులో ఉన్న అయ్యప్ప ఆలయంలో భక్తులకు శనివారం అన్నదానం నిర్వహించారు. అనంతరం అన్నదాన కమిటీకి రూ.10వేలను బలరామిరెడ్డి విరాళంగా ఇచ్చారు. బాలయేసు కళాశాలలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్.ఇంద్రజ, వైస్ చైర్మేన్ జబివుల్లాతో పాటు కౌన్సిలర్లు మారుతీరెడ్డి, అయూబ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు బలరామిరెడ్డికి జన్మదిన శుభకాంక్షలు తెలిపారు.

నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మాండూస్ తుపాను నేపథ్యంలో జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం నాడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని ప్రజలందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ సూచించారు. జిల్లాలో ప్రవహిస్తున్న పెన్నా నది, చిత్రావతి, జయమంగలి, పాపాగ్ని, మద్దిలేరు, మొదలైన నది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న రొద్దం, పరిగి, గోరంట్ల, తదితర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా కలెక్టరేట్లోని రెవెన్యూ సిబ్బంది అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 08555-282423, 9154968578, డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో పోలీస్ సిబ్బందితో పాటు ఎస్‌డిఆర్‌ఎఫ్ బందాలు నదీ పరివాహక ప్రాంతాల్లో పికెట్స్ ఏర్పాటు చేసి నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తుంటాయని చెప్పారు. ప్రజలందరూ తుపాను ప్రభావం తగ్గే వరకు నదులు, చెరువులు కుంటలు, వాగులు వంకల వద్దకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆశా కార్యకర్త పోస్ట్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కిరికెర-1 వార్డు పరిధిలోని మిట్టమీదపల్లి, కిరికెర-3 అప్పలకుంట ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బేవినహళ్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మంజునాథ్ శనివారం తెలిపారు. ఆయా వార్డుల పరిధిలోని నివాసులైన మహిళా అభ్యర్థులు సుమారు 25 నుంచి 45 సం॥ మధ్య వయస్సుతో పాటు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, అదే వార్డులోని కోడలు అయ్యి ఉండాలన్నారు. వితంతువులు, విడాకులు పొందినవారు కూడా అర్హులు అన్నారు. దరఖాస్తునందు వారి ఫోన్ నెంబర్ తెలపాలన్నారు. మిగతా వివరాల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. దరఖాస్తులు 12వ తేదీ సోమవారం సాయంత్రం 4 గం.లలోపల ఇవ్వాలన్నారు.

21న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుక్కపట్నం

దుద్దుకుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుట్టపర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన నల్లశింగయ్యగారిపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, జడ్పిటిసి శ్రీలత గోవర్ధన్ రెడ్డిలు తెలిపారు. వైద్యశిబిరానికి సంబంధించిన గోడపత్రికలను శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వగ్రామమైన నల్లసింగయ్యగారిపల్లిలో ఈనెల 21న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని జబ్బులకు ఇందులో చికిత్సలు చేస్తారన్నారు. మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు హరి, వైసిపి మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాయకులు రామలింగారెడ్డి, నారాయణస్వామి, పెనుజురి మహేష్, నగేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అందని వేతనాలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి-మడకశిర

నియోజక వర్గం వ్యాప్తంగా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి 10వ తేదీ పూర్తయినా ఇప్పటికీ వేతనాలు అందలేదు. వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలో 82 ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 17 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 450 మంది బోధన, బోధనేత విభాగాల్లో పని చేస్తున్నారు. ప్రతి నెలా 1వ తేదీ రావాల్సిన వేతనాలు ఈ నెల 10వ తేదీ అయినా ఇప్పటి వరకు రాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రాకుంటే ఈఎంఐలు, గహాల అద్దెలు, పిల్లలు ఫీజులు ఎలా చెల్లించాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా 1వ తేదీ వేతనాలు చెల్లించేలా చూడాలని ఉపాధ్యాయలు కోరుతున్నారు.

చిత్తడిలో వారపు సంత

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంత చిత్తడిలో సాగింది. శనివారం కురిసిన వర్షానికి కూరగాయలు తడిసి ముద్దయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం వస్తుండడంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారు. జనం రాకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరలకే కూరగాయలను అమ్మాల్సి వచ్చింది. వర్షం వచ్చిన ప్రతి సారి ఈ ఇబ్బందులు ఉంటున్నాయని, మార్కెట్ గదులు నిర్మించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

వర్షంలో జరుగుతున్న వారపు సంత

రాజకీయ 'చలి' మంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

చలికాలంలో చలి అధికమైన అందరినీ వణికిస్తోంటే, రాజకీయాలు మాత్రం మంటలు పుట్టిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు సిద్ధపడుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. అధికార వైసిపి ముందుగా కసరత్తును ప్రారంభించిందనే చెప్పాలి. వైసిపి రాయలసీమ బాధ్యులుగానున్న, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలో విస్తృతమైన పర్యనటలు చేపట్టారు. గతంలో ఒక రోజుతోనే పర్యటనలు ముగిసేవి. ఇప్పుడు వరుసగా జిల్లాలోనే ఉంటూ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయలోపాలుంటే వాటిని సరిచేసే కార్యక్రమాలను చేపట్టారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, ఉరవకొండ పూర్తిచేశారు. మరో రెండు రోజులు ఉండి మరిన్ని నియోజకవర్గాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎన్నికల వేడి అప్పుడే మొదలైనట్టుగా కనిపిస్తోంది. ఈ సమావేశాల్లోనూ అటువంటి సంకేతాలే ఇస్తుండటంతో అధికార వైసిపిలో అప్పుడే ఎన్నికల హడావుడి మొదలైంది. అంతేకాకుండా నిఘా వర్గాల ద్వారా గెలుపు గుర్రాల అన్వేషణ మొదలైంది. ఇప్పుడున్న నేతల పనితీరుతోపాటు, కొత్తవారైతే ఎలాగుంటారన్న ఆరాలను తీస్తున్నారు. అందుకోసం సర్వేలు కొనసాగుతున్నాయి. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా ఎన్నికల కసరత్తులోకి దిగేందుకు సిద్ధపడుతోంది. ఇప్పటికే ఇదేం ఖర్మ అంటూ

వైసిపి పాలనకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యమంలో ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. ఇక రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లో అధికారపార్టీకి వ్యతిరేకంగా పోటాపోటీగా చేపడుతున్న కార్యక్రమాలు మరింత వేడిని రగులుస్తున్నాయి. ఈ రెండు చోట్ల కొంత ఉద్రిక్తత పరిస్థితులే కొనసాగుతున్నాయి. రెండు ప్రధాన పార్టీలు ఈ రకంగా ఎన్నికలపై దృష్టి సారించే పనిలో ఉంటే, సిపిఎం రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతోంది. అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి రైతులను ఆదుకోవాలని ఉద్యమానికి సిద్ధమైంది. గత సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాలు, ప్రకృతి వైపరిత్యం రెండింటి మూలంగా దెబ్బతిన్న పత్తి రైతులను ఆదుకోవాలని వరుసగా కార్యక్రమాలను రూపొందించడం జరుగుతోంది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మార్పులను పరిశీలించేందుకు సర్వేలను ఆ పార్టీ గ్రామ స్థాయిలో చేపడుతోంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పులు, ఇబ్బందులను తెలుసుకుని అందుకు అనుగుణంగా కార్యక్రమాలను రూపకల్పన చేసే పనిని చేపడుతోంది. జిల్లాలో ఇందుకు అవసరమైన కసరత్తు సిపిఎం చేస్తోంది. ఇక అఖిల భారత కిసాన్ సభ్ (ఎఐకెఎస్) దక్షిణ భారత జీపు జాతా జిల్లాలో సాగింది. ఈ జీపు జాతాలో ఢిల్లీలో మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో చనిపోయిన రైతులను స్మరించుకుంటూ అమరవీరుల జ్యోతి యాత్ర పేరుతో చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ నాయకులు కృష్ణప్రసాద్, సాగర్, ప్రకాశం మాస్టరు పాల్గొన్నారు. పామిడి, అనంతపురం మీదుగా కర్నాటక బాగేపల్లి వరకు సాగింది. ఈ యాత్ర బృందం మధ్యలో పత్తి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం ఐక్య పోరాటాలకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వారం చివర్లో తుఫాను ప్రభావంతో తేలికపాటిక వర్షాలు పడ్డాయి.

తుమ్మలకుంట్లపల్లి, బసవప్పగారిపల్లిలో పర్యటన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

నాటు వైద్య వికటించి ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న జిల్లా వైద్యాధికారులు ఆ గ్రామాల్లో పర్యటించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ మైనుద్దీన్ శనివారం ఉదయం తుమ్మలకుంట్లపల్లి, బసవప్పగారిపల్లిలో పర్యటించారు. సూదిమందు వేయించుకున్న వారితో మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేని వారిని చికిత్సల నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేరాలని సూచించారు. బత్తపల్లి ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

మృతుల అంత్యక్రియల్లో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యే, మాజీ మంత్రి పరామర్శ

సూదిమందు వికటించి ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు ఆ గ్రామాల్లో పర్యటించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుల దహన సంస్కారాల నిమిత్తం పల్లె రఘునాథరెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి జాకీర్ అహ్మద్, టిడిపి నాయకులు వెంకటేష్, జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు. వైసిపి నాయకులు వాసుదేవ రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డిలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ వంతుగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్లు కోళ్ల కష్ణారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు

ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రానికి మోసం : టిడిపి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఒక్కఛాన్స్ పేరుతో జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, ఇదే విషయాన్ని ప్రజలు తమ వద్ద ఏకరువు పెడుతున్నారంటూ టీడీపీ నాయకులు తెలియజేశారు. శనివారం పట్టణంలోని 30, 14, 37వ వార్డుల్లో ఇదేం ఖర్మమన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. టీడీపీ హయంలో చేసిన చేసిన అభివద్ధి, సంక్షేమపథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, బోయ రవిచంద్ర, పరిసే సుధాకర్, నాగూర్ హుస్సేన్, మారుతీస్వామి, కేశగాళ్ల శీన, అత్తర్ రహీం, రాయపాటి శివ, తొగట అనిల్, నారాయణస్వామి పాల్గొన్నారు.

విధులు నిర్వహిస్తున్న చోటే ఉండాలి

రొళ్ల : గ్రామ రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్న చోటే ఉండాలని తహశీల్దార్ హసీనాసుల్తాన్ ఆదేశించారు. మండూస్ తుఫాన్ కారణంగా పెనుకొండ సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు విధులు నిర్వహించే గ్రామాల్లో బసచేయాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దెలు కూలే అవకాశం ఉందన్నారు. ఇతర నివాస సదుపాయం లేని వారికి స్థానిక స్కూలు, ఇతర ప్రభుత్వ భవనాలలో తాత్కాలిక బస ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ విషయాలను గ్రామాల్లో దండోరా మూలకంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. రోడ్డులు, వంకలు తెగే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించి మండల స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

నంబులపూలకుంట : మండల కేంద్రం ఒకప్పుడు విరివిగా చెట్లతో పచ్చగా ఉండేది. సోలార్ ప్రాజెక్ట్ రావడంతో ఎక్కడికక్కడ చెట్లను తొలగించారు. మండల కేంద్రం మాలపల్లి మెట్ట వద్ద బోటికొండ ఒకటి మాత్రమే ప్రస్తుతం మిగిలింది. ఈ కొండ దగ్గర ఇటీవల పగలు, రాత్రి అన్న తేడా లేకుండా జెసిపి మిషన్లతో మట్టిని తవ్వేస్తున్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఒక నెల నుంచి మట్టిను ఈ కొండ నుంచి తవ్వి తరలిస్తున్నారు. దీంతో క్రమంగా కొండ తరుగుతోంది. దానిపై ఉన్న చెట్లు కూడా అంతరించిపోతున్నాయి. రెవెన్యూ అధికారులకు ఇందతా తెలిసిన మౌనంగా ఉండడంపై పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అక్రమ మట్టి తరలింపును ఎందుకు అడ్డుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అడ్డుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి తరలింపుతో గుంతలమయం అయిన కొండ

రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రం కొత్త రోడ్డు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఇదే ప్రాంతంలో కొన్నినెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వైర్ తెగి చిల్లర దుకాణం పూర్తిగా కాలిపోయింది, అప్పట్లో అక్కడున్న వారు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్ష గోడ నిర్మించాలని అధికారులను కోరారు. అయినా ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు. నిత్యం జనసంచారం ఉన్న ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అందుబాటులో లేని ఇరిగేషన్ అధికారి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలో రెగ్యులర్‌గా పనిచేస్తున్న ఇరిగేషన్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని పలువురు రైతులు, ప్రజలు పేర్కొంటున్నారు. ఈ అధికారి కదిరిలో ఉంటూ మండలానికి చుట్టంచూపుగా వస్తున్నట్లు తెలుస్తోంది. కనీసం మండల సర్వసభ్య సమావేశానికి సైతం ఈయన రావడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండల వ్యాప్తంగా దాదాపు 80 వరకు చిన్నా, పెద్ద చెరువులు, వాగులు, కుంటలు ఉన్నాయి. ఇంతవరకు ఆ చెరువుల పరిస్థితి ఎలా ఉందన్న విషయంపై సదరు కనీస తనిఖీలు చేసిన దాఖలాలు లేవని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో కొన్ని చెరువులకు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో చెరువు భూమి కబ్జాకు గురిఅయినట్లు తెలుస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, కుంటలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతులపైనా సంబంధిత ఇరిగేషన్ శాఖ పట్టించుకోవడం లేదు. ఆ శాఖ మండల ముఖ్య అధికారికి ఈ విషయాన్ని తెలుపుదామని గ్రామస్తులు ఎవరైనా కార్యాలయానికి వెళ్తే ఆయన లేరనే సమాధానం వస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండల ఇరిగేషన్ అధికారి మండలంలో అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సమాజసేవ పురస్కార్-2022 అందజేత

ప్రజాశక్తి-కదిరి టౌన్

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం నాడు నెల్లూరు టౌన్ హాల్‌లో ప్రపంచ మానవ హక్కుల సంఘం(డబ్ల్యూహెచ్‌ఆర్ఎ) వారిచే జాతీయ ఛైర్మన్ మొరంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ ఛైర్మన్ సుబ్బారెడ్డి సమాజ సేవ పురస్కారం అవార్డులను వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అందించారు. అందులో భాగంగా పర్యావరణ విభాగంలో మారుతికి సమాజసేవ పురస్కార్-2022ను ప్రకటించారు. మారుతి గత ఐదు సంవత్సరాల నుంచి పర్యావరణ, అర్థిక అక్షరాశ్యతపై చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి పర్యావరణ విభాగంలో సమాజసేవ పురస్కార్ అవార్డును ప్రకటించారు.

మారుతి

ఉచిత కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో ట్రినిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్‌రాజ్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శంకర్ కంటి అసుసుపత్రి వారి సౌజన్యంతో శనివారం 91వ ఉచిత కంటి వైద్య పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ కోసం 75 మందిని ఎంపిక చేశారు. ఇదే సందర్భంగా గత నెల ఆపరేషన్లు చేసిన 179 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమార్ రాజ్ మాట్లాడుతు శస్త్ర చికిత్సకు ఎంపిక చేసిన వారిని బెంగళూరు శంకర్ కంటి అసుపత్రిలో ఉచితంగా అపరేషన్ చేయించి, అవసరమైన మందులు, కంటి అద్దాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి బందం, డాక్టర్ అను, క్యాంపు ఇన్‌ఛార్జ్ శివప్రకాశ్, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ రాజ్, సెక్రటరీ కె.ఉషారాణి, జామీయ మసీదు ముతువల్లీ నూరూల్లా, కమిటీ మెంబర్లు, వాలంటీర్ అధ్యక్షుడు షమీమ్, జాకీ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

అద్దె బస్సులో విద్యార్థుల తరలింపు..!

విద్యార్థుల జీవితాలతో చెలగాటం - ఫిర్యాదు చేసినా పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

బడిబస్సు అంటే భద్రత అధికంగా ఉండాలి. పలు నియమ నిబంధనలూ పాటించాలి. అయితే హిందూపురంలో నిబంధనలకు నీళ్లు వదలి ఓ కార్పొరేట్ పాఠశాల, ఓ ప్రవేటు ట్రావెల్స్ బస్సు ద్వారా విద్యార్థులను రోజు తరలిస్తోంది. బహిరంగంగా రోడ్డుపై ప్రయివేటు ట్రావెల్స్ ద్వారా తరలిస్తున్నా రవాణ శాఖ, విద్యాశాఖ అధికారులు దీనిపై నోరుమెదపడం లేదు. ఆ పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యాశాఖ, రవాణ శాఖకు మాముళ్లు అందుతుండడం వల్లనే వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినపిస్తున్నాయి.

ప్రయివేటు పాఠశాలల నిర్వహకులు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేయాల్సి ఉంది. హిందూపురంలో నారాయణ పాఠశాల నిర్వహకులు గత కొన్ని నెలలుగా జెఎంఎస్ ట్రావెల్స్ బస్సు నెంబరు ఎపి02వై 8034లో విద్యార్థులను వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో పాటు కొన్ని కార్పోరేట్, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తితో నిబంధనలను కాలరాస్తు, పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలిస్తున్నారు. నిబంధనల మేరకు చిన్న బస్సులో 24 మంది, పెద్ద బస్సులో 55 మందికి మించి ఎక్కించరాదు. అయితే చిన్న బస్సుల్లో 40 నుంచి 50 మందిని, పెద్ద బస్సుల్లో 70 నుంచి 80 మంది వరకు ఎక్కిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇలా భద్రతా ప్రమాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేసి బస్సులు నడుపుతున్నారు. ఏదైనా జరగరానిది జరగితే ఎన్నో కుటుంబాలు కడుపుకోతకు గురికావాల్సి వస్తోందన్న విషయాన్ని విస్మరించి విద్యాసంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

ప్రయివేటు బస్సులో వెళ్తున్న పాఠశాల విద్యార్థులు

నిబంధనలు ఇవి...

ప్రయివేటు విద్యాసంస్థలు బడి బస్సులు నడపాలంటే అందులో తగిన సౌకర్యాలు కల్పించాలి. బస్సులో సీట్ల కెపాసిటీని బట్టి విద్యార్థులను ఎక్కించాలి. బస్సులో అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి. బస్సు ప్రమాదానికి గురైనప్పుడు విద్యార్థులు సురక్షితంగా బయటపడటానికి అత్యవసర ద్వారాలు ఉండాలి. బస్సు డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవంతో పాటు లైసెన్స్, డ్రైవర్ ఆరోగ్య, మానసిక పరిస్థితులపై వైద్యులు పరీక్షలు చేసిన ధ్రువపత్రం ఉండాలి. బస్సులో తప్పకుండా ఫస్ట్ ఎయిడ్ బాక్సు అందుబాటులో ఉంచాలి. ఎంత మంది విద్యార్థులను తరలిస్తున్నారు.. వారి వివరాలు, డ్రైవర్, క్లీనర్ పేర్లు, ఫోన్ నెంబర్లు తప్పని సరిగా బస్సులో ఉంచాలి. పంక్చర్ అయితే మార్చుకునేందుకు వీలుగా స్టెఫ్నీ ఉండాలి. అయితే ఈ నిబంధనలు పట్టణంలో చాల ప్రయివేటు పాఠశాలలు పాటించడం లేదు.

చర్యలు తీసుకోవాలి

ఎక్కడైన పాఠశాల బస్సుకు ప్రమాదం జరిగితే మాత్రం రవాణా, పోలీస్ శాఖ అధికారులు తనిఖీల పేరుతో హడావుడి చేస్తారు. హిందూపురంతో పాటు జిల్లాలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థలతో పాటు కొన్ని ప్రవేయిటు పాఠశాలల యాజమాన్యాలు బస్సుల్లో నాణ్యత ప్రమణాలు పాటించడం లేదు. వెంటనే రవాణ శాఖ, పోలీస్ శాఖతో పాటు విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా తనఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో విద్యాశాఖ, రవాణాశాఖ కార్యాలయాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం.

బాబావలి,
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.